క్లుప్తంగా

ఎంపీ పరామర్శ



రవిబాబును పరామర్శిస్తున్న ఎంపీ బెల్లాన

రాజాం సిటీ: స్థానిక కాకర్లవీధికి చెందిన అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు కొల్లూరు వెంకటనాగేశ్వరరావు(రవిబాబును ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు పరామర్శించారు. ఇటీవల ఆయన తల్లి సర్వలక్ష్మి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంపీ గురువారం ఆయన వద్దకు వెళ్లి, ఆమె మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీ వెంట పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అసిరితల్లి పండగ



ముర్రాటలతో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో అసిరితల్లి పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా నూకాలమ్మ ఆలయం వద్దకు ముర్రాటలతో వెళ్లి, మొక్కులు చెల్లించుకున్నారు. పండగలో భాగంగా చేపడుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పకడ్బందీగా సింగిల్ విండో సిస్టం



మాట్లాడుతున్న ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల్లో ప్రవేశపెట్టిన సింగిల్ విండో సిస్టంను పకడ్బందీగా అమలు చేయాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ కోరారు. గురువారం స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కూళ్లు, కాలేజీల్లో సింగిల్ విండో సిస్టం అమలు చేయడం లేదని, అటువంటి విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు



బోరు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

సంతకవిటి: క్లాస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని బూరాడపేట గ్రామంలో పాడైన బోర్ల మరమ్మతులు గురువారంయుద్ధప్రాతిపదికన చేపట్టి, వినియోగంలోకి తీసుకువచ్చారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇక్కట్లు ఉండకూడదన్న ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వీటిని, బాగుచేసినట్లు జేఈ సంతోష్ తెలిపారు.


శరవేగంగా భూముల రీసర్వే



సర్వే వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి

రేగిడి: మండల వ్యాప్తంగా భూముల రీసర్వే శరవేగంగా జరుగుతోంది. మండలంలోని ఉనుకూరు గ్రామంలో జరుగుతున్న సర్వేను తహసీల్దారు టి.కల్యాణ చక్రవర్తి గురువారం పరిశీలించారు. రైతుల సమక్షంలోనే భూముల సర్వే, హద్దురాళ్ల ఏర్పాటును పక్కాగా చేయాలని ఆయన తెలిపారు. ఇప్పటివరకు మండలంలోని ఏడు గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి మోటారు ప్రారంభం



మోటారును ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీరామ్మూర్తి

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన తాగునీటి మోటారును సర్పంచ్ సాదెం శ్రీరామ్మూర్తి గురువారం ప్రారంభించారు. ప్రజలకు తాగునీటి ఇక్కట్లు లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని, దీనిలో భాగంగానే కొత్త మోటారు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.తిరుపతిరావు, టి.నారాయణరావు, ఎస్.కోటేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు దోపిడీ పాలన.. నేడు సంక్షేమ పాలన

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



రామభద్రపురం: వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: రాష్ట్రంలో నాడు టీడీపీది దోపిడీ పాలన అని, నేడు అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిది సంక్షేమ పాలన అని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తరేగ గ్రామంలో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని, గత నలభై ఏళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమం ఆయన ముఖ్యమంత్రి అయిన నాలుగేళ్లలో జరిగిందని తెలిపారు. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందేలా సచివాలయ వ్యవస్థ, లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందేలా వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి, ఆదర్శవంతమైన పాలన కొనసాగిస్తున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు సూచించిన వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. ఇప్పుడు అలా కాదన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 98 శాతం హామీలు నెరవేర్చారని, వీటితో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఇచ్చిన మరెన్నో హామీలను సీఎం జగనన్న నెరవేర్చారన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేసి చూపిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, ప్రజలంతా అండగా నిలవాలన్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మండలం పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, సర్పంచ్ కిలపర్తి మురళీకృష్ణ, ఎంపీడీఓ రమామణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం..



రాజాం: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని లచ్చయ్యపేట సచివాలయం పరిధిలో ఉన్న లచ్చయ్యపేట, మెహర్‌బాబానగర్ కాలనీల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతీ ఇంటికి మేలు జరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా అన్ని వర్గాల వారు లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రతీ ఇంటికి సగటున ఏడాదికి రూ.1లక్షకు మించి, ప్రభుత్వ సాయం సంక్షేమ పథకాల రూపంలో అందుతోందన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని నమ్మి, ఓట్లు వేస్తే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. ఇవే పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ కంబాల సందీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, ఏఈ రత్నాకర్, డీటీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

వంగర: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. గురువారం మండలంలోని కొప్పర రైతు భరోసా కేంద్రంలో రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, రైతు భరోసా పథకం ద్వారా సాగుకు ఆర్థికసాయం, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సకాలంలో గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోళ్లు, రైతు ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించి, అన్ని విధాలా రైతులను ఆదుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.నారాయుడు, ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామ సచివాలయంలో ఎంపీపీ భోగి గౌరి, సర్పంచ్ బి.వెంకటనాయుడు చేతులమీదుగా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు గురువారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులతో అధిక భూసారం, దిగుబడులు వస్తాయన్నారు. ప్రతీ రైతు వీటిని పొలంలో చల్లుకుని, 45 రోజుల తర్వాత కలియదున్నాలని తద్వారా నేల సారవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం విక్రయిస్తే కార్డు రద్దు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం విక్రయిస్తే రేషన్‌కార్డు రద్దు చేస్తామని డిప్యూటీ తహసీల్దారు ఆర్.సాయికృష్ణ హెచ్చరించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రేషన్‌షాపు డీలర్లు, రేషన్ సరఫరా వాహన ఆపరేటర్లతో సమావేశమైన ఆయన ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం రేషన్ బియ్యం పంపిణీ చేస్తోందని, అయితే కొంతమంది వాటిని దళారులకు విక్రయిస్తున్నారని తెలుస్తోందన్నారు. అనవసరం లేదనుకున్న వారికి ఆ బియ్యం ఎందుకని, అలాంటి వారి కార్డులు తీసేసి, కావాల్సిన వారికి ఇస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చినవారమవుతామన్నారు.

నేడు నందిగాంలో గడప గడపకు..

తెర్లాం: మండలంలోని నందిగాం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ గర్భాపు లూర్దు, వైస్ ఎంపీపీలు చేపేన సత్యనారాయణ, రమాదేవి పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

నేత్ర శస్త్రచికిత్సకు 37 మంది ఎంపిక



బొబ్బిలి: మండలంలోని పిరిడి గ్రామంలో శంకర్ ఫౌండేషన్, చెలికాని అచ్యుతరావు ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించి, పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. 37 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే కంబాల జోగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వంగర: రాష్ట్రంలో పేదరికం నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని మద్దివలస గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో తెలుసుకున్న ప్రజల కష్టాలను రూపుమాపేందుకు అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. నవరత్నాలతో పాటు మరెన్నో హామీలు నెరవేర్చారన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయన్నారు. ఇక్కడ అమలవుతున్నన్నీ సంక్షేమ పథకాలు దేశంలోని మరే రాష్ట్రంలో లేవన్నారు. వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ఇదే ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ ఇన్‌చార్జ్ కె.సందీప్, వంగర, రాజాం ఎంపీపీలు యు.సురేష్‌ముఖర్జీ, ఎల్.రాజగోపాల్, ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యంత్రసేవా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



రైతులకు ట్రాక్టర్లు అందిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా రైతు సంఘాలకు రాయితీపై అందిస్తున్న ట్రాక్టర్లు, ఇతర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు కోరారు. మండలంలోని గంగన్నపాడు గ్రామంలో వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద పలు రైతు సంఘాలకు మంజూరైన ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను గురువారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతును రాజు చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. పంటలకు సంబంధించి, విత్తు నుంచి పంట విక్రయించుకునే వరకు సొంత గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని సదుపాయాలు కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ హయాంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు పోలీసుల లాఠీ దెబ్బలు తినాల్సి వచ్చేదని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీఓ రామకృష్ణ పాల్గొన్నారు.

కొలత ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు వేతనం



మెంటాడ: వేతనదారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఏపీఓ చిన్నప్పయ్య

రాజాం: కొలత ప్రకారం చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందని ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు. మండలంలోని ఒమ్మి గ్రామ శాసపువాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించిన ఆయన పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవి నేపథ్యంలో ఎండ బారినపడకుండా రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలోనే పనులు చేసుకోవాలన్నారు. పని ప్రదేశంలో తప్పనిసరిగా తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు పరిశీలించి, పలు సూచనలు చేశారు. రెండు పూటలా కొలత ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.275 వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ హరనాథరావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని మీసాలపేట గ్రామంలో పెద్దయ్యవాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ చిన్నప్పయ్య గురువారం పరిశీలించారు. అనంతరం వేతనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహంతి రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వినియోగం తగ్గించండి

తెర్లాం: సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు సెల్‌ఫోన్ వినియోగం ద్వారా కలిగే లాభనష్టాలపై గురువారం అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ వినియోగిస్తూ చాలామంది తమ విలువైన సమయం వృథా చేసుకుంటున్నారని మహిళా పోలీసులు రమాదేవి, తులసి తెలిపారు. వచ్చీరాని ఆపరేటింగ్‌తో అనవసర మెసేజ్ లింక్‌లపై క్లిక్ చేసి, సైబర్ మోసానికి గురవుతున్నారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని, లేకపోతే జ్ఞాపకశక్తి తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో దాదాపు 15 రోజుల పాటు వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ బోధించిన హిందీ టీచర్ కొల్లి సంధ్యను గురువారం సన్మానించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

రేగిడి: మండలంలోని సరసనాపల్లి, ఒప్పంగి, రేగిడి గ్రామాల్లోని ప్రజలు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనంతో బయటకు వచ్చేటప్పుడు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. అధిక లోడు, పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



రాజాం సిటీ: వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు



బొబ్బిలి: వలంటీర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు



తెర్లాం: వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీ చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



రేగిడి: వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు



సంతకవిటి: వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ రఘునాధాచారి, ఎంపీటీసీ సన్యాసినాయుడు

తెర్లాం: వలంటీర్లు సంక్షేమ సారథులని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందిస్తున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గంగన్నపాడు గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రామ సచివాలయ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో ఎంపీ, ఎమ్మెల్యే కలిసి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కరోనా విపత్తు సమయంలోనూ వలంటీర్లు ప్రతినెలా సామాజిక పెన్షన్ల పంపిణీ సక్రమంగా చేపట్టారన్నారు. రానున్న రోజుల్లో మరింత బాధ్యతాయుతంగా పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, సర్పంచ్ సరోజిని, ఎంపీడీఓ రామకృష్ణ, పీఆర్ డీఈ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండలంలోని జన్నివలస, కొట్టక్కి గ్రామ సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, ఉత్తమ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సారంగదొర, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని రేజేరు, ఆనవరం గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, ఉత్తమ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో ఎంపీపీ బోను గౌరమ్మ సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.రమేష్, సర్పంచ్ బి.నాయుని వెంకటనాయుడు, ఎంపీడీఓ కె.అక్కారావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాయిరాలవలస, వెంకంపేట, తునివాడ గ్రామాల్లోని ఉత్తమ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు సన్మానించారు.

సంతకవిటి: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాలాడ సచివాలయంలో వాలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు, సర్పంచ్ వి.గౌరి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలో బొద్దాం గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, ఉత్తమ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో వైస్ ఎంపీపీ నక్క వర్షిణి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.తవిటమ్మ, ఎంపీడీఓ బి.శంకరరావు, పంచాయతీ కార్యదర్శి గోపాలం, వీఆర్‌ఓ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని మరుపల్లి, మచ్చర్ల గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, ఉత్తమ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో జెడ్పీటీసీ గారతవుడు సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



రాజాం: సత్కారం అందుకున్న వలంటీర్లు



మెంటాడ: మరుపల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న జెడ్పీటీసీ తవుడు



రామభద్రపురం: వలంటీర్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ సారంగదొర



బాడంగి: సత్కారం అందుకున్న వలంటీర్లతో ప్రజాప్రతినిధులు

బొబ్బిలి: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా పాతబొబ్బిలిలో ఉత్తమ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు సన్మానించారు. కార్యక్రమంలో జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ ఆర్.ఈశ్వరరావు(విసు), కౌన్సిలర్లు సీహెచ్ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చయ్యపేట-2 వార్డు సచివాలయంలో ఉత్తమ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే కంబాల జోగులు సన్మానించారు. అనంతరం వారి సేవలను ఆయా నేతలు ప్రశంసించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల పాత్ర చాలా కీలకమన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో కూడా ప్రాణాలకు సైతం తెగించి, పనిచేశారని, వారి సేవలు కొనియాడలేనివన్నారు. ముమ్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పని చేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, పార్టీ యువ నాయకుడు కంబాల సందీప్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.